క్లుప్తంగా

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్ఞ

కొయ్యూరు: మండలంలోని మంప గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. నాబార్డ్–రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీ డాక్టర్ మనోజ్ఞ వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రొటీన్ పౌడర్లు, మల్టీ విటమిన్ టానిక్‌లు, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాతోట ప్రోగ్రాం మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ శిబిరానికి స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 160 మంది వచ్చారని వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు తెలిపారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు



చలపతిరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ శ్రీనుబాబును సన్మానిస్తున్న విద్యార్థులు తదితరులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చలపతిరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రపంచ అధ్యాపకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దండకారణ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనుబాబును విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు ఘనంగా సన్మానించారు. గిరిజన మిత్ర బ్యాంక్ సభ్యులు భాగ్యవతి, మౌనిక, మణి, తదితరులు పాల్గొన్నారు.

కిలగాడలో జంగిల్ క్లియరెన్స్



తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఇందులో భాగంగా కిలగాడ బస్ షెల్టర్ నుంచి పీహెచ్‌సీ, సచివాలయం వెళ్లే మార్గంలో ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు సర్పంచ్ శివశంకర్ జంగిల్ క్లియరెన్స్ చేయించారు. వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పెద్దబాలన్న

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి పంచాయతీ గన్నెల గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ఎం.పెద్దబాలన్న శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి అందుబాటులో రానుండడంతో గ్రామస్తులకు రవాణా ఇబ్బందులు ఉండవన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించి, సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు. పీఆర్ ఏఈ మాణిక్యం, వైస్ సర్పంచ్ చంద్రమోహన్, వార్డు సభ్యుడు కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.గంగరాజు, పంచాయతీ కార్యదర్శి రవిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



జోలాపుట్టు జలాశయం మార్గంలో పాడైన రహదారి



జోలాపుట్టు జలాశయంపై నుంచి వెళ్తున్న భారీ వాహనాలు

- జోలాపుట్టు జలాశయంపై నుంచి భారీ వాహనాల రాకపోకలు
- సరిహద్దు వంతెన లేకపోవడంతో అవస్థలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహించే మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయానికి ప్రమాదం పొంచి ఉంది. జలాశయంపై నుంచి భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధం. కానీ సరిహద్దు రాష్ట్రాల రాకపోకలు చేసే వంతెన గతంలో కొట్టుకుపోవడంతో జలాశయంపై నుంచే రాకపోకలు చేసేందుకు దిక్కుగా మారాయి. జలాశయం నిర్మించి 70ఏళ్లు పైగా అవుతుండడంతో భారీ వాహనాలు చేస్తే ముప్పు తప్పదని పలువురు వాపోతున్నారు.

లోడ్ వాహనాలను పూర్తిగా నిషేధించాలి..

ప్రతి రోజు వందల కొద్ది వాహనాలు, భారీ లోడ్‌లతో జలాశయం మీదగా వెళ్తూ ఉండడంతో ఆందోళన చెందాల్సి వస్తుంది. జలాశయం పట్టుత్వం కోల్పోయి ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జలాశయం అధికారులు ఎప్పుడు గేట్లు తెరిచి ఉండడంతో వాహనాల రాకపోకలు నియంత్రణ లేకపోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా లారీలు, వ్యాన్లు, ప్రైవేట్ బస్సులు సైతం జలాశయంపై నుంచి రాకపోకలు జరుగుతున్నాయి. నిజానికి అనుమతి లేనిదే ఎటువంటి వాహనాలు జలాశయం మార్గంలో ప్రయాణించకూడదు. కానీ జలాశయ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. భారీ లోడ్‌తో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వంతెనపై రోడ్డు పలుచోట్ల దెబ్బతింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన లేకపోడంతోనే అవస్థలు

జోలాపుట్టు వద్ద ఇరురాష్ట్రాలు కలిపే సరిహద్దు వంతెన లేకపోవడంతోనే రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.గత నెల వరద నీరు ఉధృతికు తాత్కాలికంగా వంతెన కొట్టుకుపోవడంతో కష్టాలు మారింత పెరిగాయి. వెంటనే తాత్కాలిక వంతెనను మరమ్మతులు చేశారు.దీంతో ద్విచక్రవాహనాలు వీలుగా తాత్కాలిక వంతెన పై నుంచి రాకపోకలు జరుగుతున్నాయి.గత 15ఏళ్లపైగా సరిహద్దు వంతెన కోసం ఇరు రాష్ట్రాలు ప్రకటనలు చేస్తున్నారు తప్ప కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సరిహద్దు వంతెనను నిర్మిస్తే సరిహద్దులోని 230గ్రామాల వరకు రవాణా ఇబ్బందులు తొలగుతాయి. వంతెన అందుబాటులోకి వస్తే జలాశయంపై నుంచి రాకపోకలు నిలుస్తాయి. దీని వల్ల జలాశయం వాహనాల రాకపోకలు వల్ల కలిగే ముప్పు తప్పుతుంది.



జోలాపుట్టు జలాశయం డ్యామ్

వంతెన నిర్మించాలి

సరిహద్దు వంతెన లేకపోవడం వల్ల నిత్యం రాకపోకలకు అవస్థలు పడుతున్నాం.దీంతో జలాశయం పైనుంచి రాకపోకలు చేయాల్సి వస్తుంది. గత పలుమార్లు సరిహద్దు వంతెన కోసం నిధులు మంజూరు చేసి ప్రకటనలు చేశారు. కానీ నేటికి వంతెన పనులు మొదలు కాలేదు. ఇరురాష్ట్రాల ప్రభుత్వం, అధికారులు స్పందించి సరిహద్దు వంతెన సమస్యను పరిష్కరించాలి.

– వి.జగదీష్, జోలాపుట్టు

చర్యలు తీసుకోవాలి

జోలాపుట్టు జలాశయం పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు నిషేదం అని తెలిసినా తప్పనిసరి పరిస్థితిలో రాకపోకలు చేయాల్సి వస్తుంది. ఇరురాష్ట్రాల ప్రజలకు రాకపోకలకు ఉన్న ఒకే ఒక్క మార్గం జలాశయం పై నుంచే. జలాశయానికి ప్రమాదం అని తెలిసిన ప్రయాణాలు చేస్తున్నాం.ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు సరిహద్దు వంతెనపై చర్యలు తీసుకోవాలి.

– నగేష్, బిల్లాపుట్టు గ్రామం, ఒడిశా

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ రూరల్: నియోజకవర్గంలోని అవసరమైన ప్రతిచోట సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండల కేంద్రం పాత్త పోస్టుకాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మత్స్యలింగం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మన్య ప్రాంతాభివృద్ధికి సంవృద్ధిగా నిధులు మంజూరయ్యాయని, ఈ కారణంగా పనులు జరిగాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఆరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, గుణపాఠం చెబుతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు సత్రుగున్, భీమరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్, నర్సింహామూర్తి, రామ్మూర్తి, పంచాయితీ రాజ్ డీఈఈ రామం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు



గణపతి విగ్రహం ఊరేగింపు

సాక్షి, పాడేరు: సుంద్రపుట్టులో వినాయక ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. భారీ గణపతి విగ్రహాన్ని పాడేరు పురవీధుల్లో ఊరేగించారు. గిరిజన మహిళలు, యువత థింసా నృత్యాల నడుమ గణనాథుని విగ్రహం ఊరేగింపు సంబరంతో పాడేరు పట్టణం హోరెత్తింది. అనంతరం చిలకలమామిడి గెడ్డలో భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

కలెక్టర్ దృష్టికి రహదారుల సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన ఎంపీపీ రమేష్

కొయ్యూరు: కాకరపాడు–కొయ్యూరు రహదారిని, అదే విధంగా బూదరాళ్ల– చాపరాతిపాలెం రహదారిని విస్తరించాలని కోరుతూ కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్టు ఎంపీపీ బడుగు రమేష్ చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి కొయ్యూరు మండలంలో నెలకొన్న పలు సమస్యలను వివరించినట్టు తెలిపారు. కాకరపాడు – కొయ్యూరు రోడ్డు విస్తరణ జరగకపోవడంతో తరచూ ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు బూదరాళ్ల మీదుగానే రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరుకు వెళ్లే రహదారిని కూడా పూర్తిగా విస్తరించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. మంప పంచాయతీ పైడిపనుకులకు బీటీ రహదారి వేయాలని, రేవళ్లలో ప్రభుత్వ రెగ్యులర్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

గిరిజన మ్యూజియంను సందర్శించిన ఎన్‌సీసీ క్యాడెట్లు



మ్యూజియం వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లు కమాండర్ గోపేంద్ర కల్నల్ తదితరులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోనిగిరిజన మ్యూజియం, కాఫీ హౌస్‌లను శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ గోపేంద్ర కల్నల్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ అకాడమీలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులకు అవేర్‌నెస్ టూర్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లాలో పర్యటనకు తీసుకొచ్చినట్టు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలోని 190 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, స్థితిగతులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

దీంతో పాటు జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న స్థానిక రవ్వలగుడ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం పాఠశాల అవరణలో పాడేరు ఐటిడిఏ పీవో అభిషేక్‌ను మర్యాదపూర్వకంగా కలనున్నట్టు చెప్పారు. డిప్యూటీ క్యాంప్ కమాండర్ ప్రచాత్ ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



కూనవరంలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారులు, సిబ్బంది

కూనవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సబ్ డీఎఫ్‌వో కె.వి.ఎస్.రాఘవరావు, రేంజ్ ఆఫీసర్ వి.కరుణాకర్ అన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మంది సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడుతూ చింతూరు డీఎఫ్‌వో బబిత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వన్య ప్రాణి సంరక్షణకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వైఖరి అలవర్చుకోవాలని కోరారు. అనంతరం పైదిగూడెంలో నిర్వహించిన అవగాహన కార్యక్రంలో వన్యప్రాణుల ఉనికి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సాయి వెంకటరమణ, అనిల్ కుమార్, శంకర్‌రెడ్డి, ప్రసన్న కుమార్, ఎఫ్‌బీబోలుజంపన్నకుమార్, కాంతారావు, సీతారామరాజు, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీసాయిహర్ష బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా ఎం.శ్రీసాయిహర్ష శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్‌టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీసాయిహర్ష మాట్లాడుతూ మండల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని, మండల వాసులు అందరూ సహకారం అందించాలని కోరారు.

మన్యంలో భారీ వర్షం



డుంబ్రిగుడ మెయిన్‌రోడ్డులోని దుకాణంలోకి చొరబడుతున్న వరదనీరు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో మెయిన్‌రోడ్డులోని దుకాణాలను వర్షపునీరు, బురద ముంచెత్తింది. దుకాణదారులు నానా అవస్థలు పడ్డారు. వర్షపునీరు, బురద దుకాణాల్లోకి రాకుండా అష్టకష్టాలు పడ్డారు. రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో వారపు సంతకు వచ్చిన గిరిజనులు, రైతులు ఇబ్బందులు పడ్డారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మారేడుమిల్లి: రంపచోడవరం నియోజవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శనివారం అమరావతి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్టు టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లాల రాజ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు రాత పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ప్రభుత్వం తరపున స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు, బ్రిడ్జీలు నిర్మించాలని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలను కల్పించాలని, పంచాయితీలకు నిధులు కేటాయించాలని తదితర అంశాలను వినతిలో పేర్కొన్నట్టు తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం



వి.కోడాపల్లిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేత ధర్మన్నపడాల్

జి.మాడుగుల: మండలంలోని భీరం పంచాయతీ కోడాపల్లిలో శనివారం సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం చిత్రపటానికి కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల శాఖ కార్యదర్శి ధర్మన్నపడాల్ మాట్లాడుతూ గ్రామ సమస్యలపై పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. ఇటీవల తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యచరణ రూపొందించుకొని కొనసాగించటానికి తీర్మానం చేశారు. నాయకులు దీనబంధు, కోటిబాబు, ధర్మారావు, రామన్న,రాంనాయుడు తదితరలు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయ ప్రారంభోత్సవం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారి విగ్రహం



హోమంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లిలో గిరిజనుల ఆరాధ్య దైవం ఏడూళ్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని వేద మంత్రాల నడుమ వేదపండితులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విగ్రహదాత, ఆలయ నిర్మాణ ధర్మకర్తలు నాగేంద్ర ప్రసాద్, సురేషిణి దంపతులు హోమం తదితర కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న దాతలు

సీలేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిరాశ్రయులైన జి.కె.వీధి మండలం దుప్పులవాడ పంచాయితీ వలసపల్లి గ్రామానికి చెందిన 21 గిరిజన కుటుంబాలకు తమ సొంత డబ్బులతో నిత్యావసర సరకులను దాతలు పంపిణీ చేశారు. రోడ్డు సదుపాయం కూడా లేని వలసపల్లి గ్రామానికి వెళ్లి ఎత్తైన కొండపై నివాసముంటున్న ఆదివాసీలకు తమ వంతు సాయంగా సీలేరు జూనియర్ కాలేజీ అధ్యాపకుడు సాయిరాం, పోస్టుమాస్టర్ ప్రసాద్‌రావుతో పాటు స్థానిక యువకులు తలుపులయ్య ,సాయి, శివ, మహేష్‌ల సహాయంతో నిత్యావసర సరకులు అందజేశారు. గ్రామానికి కనీసం మంచి నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండపై నుంచి చెట్లు , బురద జారుకొని వచ్చేయడంతో గ్రామస్తుల ఇళ్లు కూడా కొంతమేర దెబ్బతిన్నాయి.అయితే వలసపల్లి గ్రామంలో మొత్తం 21 గిరిజన కుటుంబాలు ఉన్నాయని, ఆ గ్రామానికి ద్విచక్రవాహనాలపై వచ్చామని దాతలు చెప్పారు. అనంతరం బాధితులకు బియ్యం, కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ సన్మానం



సీఐ రవికుమార్, ఎస్ఐ సాధిక్‌లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు నూతనంగా విధుల్లో చేరిన సీఐ రవికుమార్, ఎస్ఐ సాధిక్‌లను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, కొమరం పండుదొర, కోసు రమేష్‌బాబుదొర, కుంజం వెంకటలక్ష్మి, బొరగా వెంకటలక్ష్మి, కారం స్వామిదొర, ఎంపీటీసీ సభ్యులు తుర్రం వెంకటేశ్వర్లుదొర, సాయిబాబాదొర, కుంజం వంశీదొర, ఉలవల లక్ష్మి,పాపారావు, నాయకులు జల్లేపల్లి రామన్నదొర, పండా రామకృష్ణదొర, పండా నాగన్నదొర, రాపాక సుదీర్, బొబ్బా శేఖర్, కుంజం రామకృష్ణదొర, వేము తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



అంబలం పూజకు వేసిన సెట్‌లో దేవతామూర్తుల చిత్రపటాలు



రాజవొమ్మంగిలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సాక్షి,పాడేరు: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల కనక దుర్గమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి దుర్గమ్మతల్లికి అంబలం పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాడేరుకు చెందిన భక్తులు బి.నాగబాబు, సత్యవతి, ఎ.సురేష్, చంటి దంపతులు ఈ అంబలం పూజను ఏర్పాటు చేశారు. భారీసెట్‌ను వేసి దుర్గమ్మతల్లి ప్రతిమతో పాటు పలు దేవతామూర్తుల చిత్రపటాలను కొలువుదీర్చి పూజలు చేశారు. గురుస్వామి రాజేష్ ఆధ్వర్యంలో పూజ జరిగింది. భవానీ మాలధారులు పూజలో పాల్గొని భజనలు చేశారు.

రాజవొమ్మంగి: జడ్డంగి గ్రామంలోని దుర్గగుడిలో అన్నపూర్ణ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భవానీ మాలధారులు